ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి మెదక్

5

జిల్లాల వార్తలు

సోమవారం 29 సెప్టెంబరు 2025

కష్టాన్ని ఎదిరించి..

కొలువులు సాధించి..

గ్రూప్-2లో మెరిసిన ఉమ్మడి జిల్లావాసులు 7

సద్దుల బతుకమ్మపై సందిగ్ధం

మెదక్‌లో వేడుకల నిర్వహణపై మల్లగుల్లాలు 7

లక్షణంగా

తొలగింపు

ఇప్పటికే 24వేల మంది ఓటర్ల తొలగింపు

ఇంటింటికి వెళ్లి విచారణ.. ఓటరు లేకుంటే వేటు

మృతిచెందిన పేర్లు జాబితా నుంచి ఔట్!

పటాన్‌చెరు సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరున్న పటాన్‌చెరులో భారీగా ఓట్లకు కత్తెర పడనుందని తెలుస్తున్నది. వలస కార్మికులు, చిరుద్యోగులు ఎక్కువగా ఉండే నియోజకవర్గంలో అద్దె ఇళ్లు మారుతున్నప్పుడల్లా కొత్త చోట ఓటరుగా నమోదు చేసుకుంటున్నారు. కానీ, పాత చిరునామాలో ఉన్న ఓటు రద్దు చేసుకోవడం లేదు. చనిపోయినవారి ఓట్లను సైతం తొలగించలేదు. దీంతో ఓటర్ల సంఖ్య లక్షల్లోకి చేరుకుంది. దీనిపై దృష్టిసారించిన కేంద్ర ఎన్నికల సంఘం క్షేత్రస్థాయి విచారణకు ఆదేశించడంతో ఓట్ల లెక్క తేల్చే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

పదేళ్లలో లక్ష ఓట్లు అదనం

పటాన్‌చెరు నియోజకవర్గంలో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో 2.35 లక్షల మంది ఓటర్లుండగా.. 2019 ఎన్నికల నాటికి లక్ష ఓట్లు పెరిగాయి. 2023 ఎన్నికల నాటికి మరో యాభైవేలు పెరిగి 3.8 లక్షల ఓట్లు నమోదయ్యాయి. ప్రతీ ఐదేళ్లకు లక్ష మంది ఓటర్లు పెరుగుతున్న తీరుపై ఎన్నికల సంఘం దృష్టిసారించింది. ఇందుకనుగుణంగా అధికారులు నజరి నక్ష పేరుతో ఒక్కో పోలింగ్‌బూత్‌ను యూనిట్‌గా తీసుకుని ఓటర్ల లెక్క తేల్చుతున్నారు. ప్రస్తుతం ప్రతీ పోలింగ్‌బూత్‌లో 1,400 మంది ఓటర్లు ఉండగా.. పాలనా సౌలభ్యం కోసం 1,200కు కుదిస్తున్నారు.

చిరునామాలో ఉంటేనే ఓటు

క్షేత్రస్థాయిలో ఓటర్లను గుర్తించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో ప్రతీ ఓటరు పేరిట అనెక్షర్ ఫాం-సి అనే పత్రాన్ని సిద్ధం చేస్తున్నారు. దీనిలో ఓటరు పేరు, చిరునామా ఉంటాయి. బీఎల్‌వోలు సర్వేకు వెళ్లినప్పుడు జాబితాలో ఉన్న ఓటరును ఫొటో తీసి, ఫాం-సిలో అతికించి ప్రత్యేకంగా రూపొందించిన సాఫ్ట్‌వేర్‌లో అప్‌లోడ్ చేస్తారు. దీంతో, సదరు వ్యక్తి దేశంలో ఎన్ని ప్రాంతాల్లో ఓటరుగా నమోదు చేయబడి ఉన్నారో తెలుస్తుంది. ఓటు ఎక్కడ ఉంచాలో అడిగి, మిగిలినచోట్ల ఓటుహక్కును రద్దు చేస్తారు. బీఎల్‌వో సర్వేకు వెళ్లినప్పుడు చిరునామాలో సదరు ఓటరు లేకపోతే ఓటు హక్కును అక్కడికక్కడే రద్దు చేస్తారు. సర్వే సమయంలో ఎవరైనా ఒక్కరు ఉన్నా మిగిలినవారి ఫొటోలు అడిగి తీసుకుని అప్‌లోడ్ చేస్తారు.

లక్ష ఓట్లు తొలగించే అవకాశం!

నియోజకవర్గంలో 2023 డిసెంబరు నుంచి ఇప్పటివరకు విచారణ అనంతరం 24,288 ఓట్లు తొలగించారు. ఇంకనూ అమీన్‌పూర్, ఐలాపూర్, ఐడీఏబొల్లారం, ఇస్నాపూర్, బండ్లగూడ, చిట్కుల్, ముత్తంగి, జిన్నారం ప్రాంతాల్లో అత్యధికంగా బోగస్ ఓట్లు ఉండే

మిగతా 8వ పేజీలో

జడ్పీ బరిలో త్రిష..!

సంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ రేసులో మంత్రి దామోదర్ కూతురు

మునిపల్లి లేదా చౌటకూర్ మండలాల నుంచి పోటీ

నిలువరించేందుకు ఇతర పార్టీల వ్యూహం

చైర్మన్ పీఠం ఆశిస్తున్న సంగారెడ్డి, ఖేడ్ ప్రాంతాల నేతలు

సంగారెడ్డి, సెప్టెంబరు 28, (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): సంగారెడ్డి జిల్లాలో 25 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. 13 మంది మద్దతు ఉన్నవారికే జడ్పీ చైర్మన్ పదవి దక్కుతుంది. ఎలాగైనా మ్యాజిక్ జూంబర్‌ను దక్కించుకొని జడ్పీ పీఠాన్ని కైవసం చేసుకోవాలని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ వ్యూహరచన చేస్తున్నాయి.

రిజర్వేషన్ల ప్రకటనతో పల్లె వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఏ నోట విన్నా ఎన్నికల గురించే మాట్లాడుతున్నారు. కొందరికి అనుకూలంగా.. మరికొందరికి ప్రతికూలంగా రిజర్వేషన్లు రావడంతో జిల్లా వ్యాప్తంగా సమీకరణాలు మారనున్నాయి. కాగా జిల్లా పరిషత్ చైర్మన్ రిజర్వేషన్‌ను ఎస్సీ జనరల్ వర్గానికి కేటాయించడంతో పలువురి పేర్లు చర్చకు వస్తున్నాయి.

మంత్రి నిర్ణయం ఏమిటో?

జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కూతురు త్రిష జడ్పీ పీఠం బరిలో ప్రముఖంగా వినిపిస్తున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో తండ్రి తరఫున ఆమె విస్తృతంగా ప్రచారం చేశారు. భవిష్యత్‌లో పెద్ద పదవికి పోటీ చేస్తారని చెప్పుకుంటున్న నేపథ్యంలో జడ్పీ చైర్మన్ పీఠం ఎస్సీ జనరల్‌కు కేటాయించడంతో ఆసక్తి నెలకొన్నది. పార్టీ అధిష్ఠానం, స్థానిక నేతలు, మండలస్థాయి నేతల అభిప్రాయాలను తెలుసుకున్న అనంతరమే మంత్రి దామోదర్ నిర్ణయం తీసుకుంటారని చెప్పుకుంటున్నారు. ఇప్పటికే ఆందోల్ నియోజకవర్గం నుంచి ఆయన మంత్రిగా ఉన్న నేపథ్యంలో జిల్లాలోని ఇతర నియోజకవర్గాలకు జడ్పీ చైర్మన్ పదవి ఇవ్వాలనే అభిప్రా



తండ్రితో త్రిష దామోదర్

యాలు కూడా వ్యక్తమవుతున్నాయి. సంగారెడ్డి, నారాయణఖేడ్ నియోజకవర్గాల నుంచి పలువురు నేతలు జడ్పీ చైర్మన్ పీఠాన్ని ఆశిస్తున్నారు.

పోటాపోటీగా ప్రయత్నాలు

అధికార పార్టీకి దీటుగా బీఆర్ఎస్ పావులు కలుపుతోంది. మంత్రి దామోదర్ రాజనర్సింహ వ్యూహాలను నిలువరించేందుకు కసరత్తు చేస్తున్నారు. త్రిష దామోదర్ పోటీ చేసేందుకు అవకాశమున్న మునిపల్లి, చౌటకూర్ మండలాలపై బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ నేతలు సైతం దృష్టి పెడుతున్నారు. ఆందోల్ నియోజకవర్గంలోనే ఉన్న ఈ రెండు మండలాలను ఎస్సీ జనరల్‌కు కేటాయించడంతో ఆ వర్గానికి చెందిన ముఖ్య నేతలను రంగంలోకి దింపడానికి కసరత్తు చేస్తున్నారు.

ఫ్యూచర్ సిటీ శంకుస్థాపన కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి



ఫ్యూచర్‌సిటీ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి పాల్గొన్న నిర్మలాజగ్గారెడ్డి

సంగారెడ్డి టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలో ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రోల్ మోడల్‌గా నిలిపేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని ఆమె తెలిపారు. ఫ్యూచర్ సిటీతో హైదరాబాద్ మహానగరం ప్రపంచంలోనే అద్భుతమైన సిటీగా మారబోతోందని పేర్కొన్నారు.



ఫ్యూచర్‌సిటీ శంకుస్థాపనలో నిర్మలాజగ్గారెడ్డి

కొలత తగ్గిందా.. కొరడానే!

సంగారెడ్డి జిల్లాలో ముమ్మరంగా తనిఖీలు

తూకంలో మోసాలపై 'లీగల్ మెట్రాలజీ' ఉక్కుపాదం

ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే స్పందన

అక్రమ వ్యాపారులపై కేసులు, జరిమానాలు

6

మినీ ట్యాంక్‌బండ్ కలేనా..?

ఏడేళ్ల క్రితం నిధులు

మంజూరు

అరకొర పనులతో

నీరుగారిన లక్ష్యం



రామాయంపేట మల్లెచెరువు కట్ట



మహాచండి అలంకారంతో దర్శనమిస్తున్న వనదుర్గ

మహాచండి అలంకారంలో ఏడుపాయల వనదుర్గమాత

పాపన్నపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఏడుపాయల వనదుర్గమాత మహాచండి (కాళరాత్రి) అలంకారంతో దర్శనమిచ్చారు. అర్చకులు శంకరశర్మ, పార్థివశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని నారింజరంగు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మంజీరా నది వంతెనల పైనుంచి పొంగిపొర్లుతుండటంతో రహదారులు మూసేయడంతో భక్తుల సంఖ్య తక్కువగా కనిపించింది.

మెదక్‌లో పోటాపోటీ

జడ్పీ పీఠం జనరల్‌కు..

భారీగా ఆశావహులు

రేసులో వారిద్దరు!

సంగారెడ్డి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మెదక్ జడ్పీ పీఠం జనరల్ కావడంతో ఆశావాహుల సంఖ్య పెరుగుతున్నది. ఇప్పటికే పలువురి పేర్లు చర్చకు వస్తున్నాయి. జిల్లాలో మొత్తం 21 జడ్పీటీసీ స్థానాలు ఉండగా.. 11 మంది మద్దతు ఉన్నవారికే జడ్పీ పీఠం దక్కనున్నది.

కాంగ్రెస్ నుంచి మదన్‌రెడ్డి!

కాంగ్రెస్ నుంచి నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పేరు బలంగా వినిపిస్తున్నది. ఆయన సొంత మండలం కౌడిపల్లిలో రిజర్వేషన్ అనుకూలించకపోవడంతో ఓపెన్‌గా ఉన్న కొల్చారం నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్నది. ఈమేరకు పార్టీ అధిష్ఠానంతో పాటు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నుంచి మదన్‌రెడ్డికి స్పష్టమైన హామీ ఉందని సమాచారం. మరోవైపు కాంగ్రెస్ నుంచి తాము కూడా రేసులో ఉన్నామంటూ మరికొంత మంది ముఖ్య నేతలు సైతం సంకేతాలు ఇస్తున్నారు. కానీ మదన్‌రెడ్డికే మొగ్గుచూపుతారని తెలుస్తున్నది.



దేవేందర్‌రెడ్డి



మదన్‌రెడ్డి

రేసులో దేవేందర్‌రెడ్డి!

బీఆర్ఎస్ తరఫున మెదక్ మాజీ ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మారెడ్డి భర్త దేవేందర్‌రెడ్డి పేరు బలంగా వినిపిస్తున్నది. నియోజకవర్గంలోని రామాయంపేట మండలం జడ్పీటీసీ స్థానం జనరల్‌గా మారడంతో ఆయన రామాయంపేట నుంచి జడ్పీటీసీగా బరిలోకి దిగుతారని ప్రచారం జరుగుతోంది. అధికార పార్టీ వ్యూహాలను ఎదుర్కోవాలంటే అనుభవం ఉన్నవారిని బరిలోకి దించాలని బీఆర్ఎస్ అధిష్ఠానం యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు బీజేపీ సైతం తమ ప్రభావాన్ని చాటుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నది. అన్ని మండలాల్లో పోటీ చేయడానికి బలమైన నేతల కోసం అన్వేషణ ప్రారంభించింది.

కొలత తగ్గిందా.. కొరడానే!

- సంగారెడ్డి జిల్లాలో ‘లీగల్ మెట్రాలజీ’ ముమ్మర తనిఖీలు
- తూకంలో మోసాలపై ఉక్కుపాదం
- ఫిర్యాదు అందిన 24 గంటల్లోనే స్పందన
- అక్రమ వ్యాపారులపై కేసులు, జరిమానాలు

సంగారెడ్డిఅర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మార్కెట్లో నిత్యావసర వస్తువులు, పప్పులు, కూరగాయలు, తినుబండారాలు.. ఇలా మనం కొనుగోలు చేసే ప్రతీ వస్తువు నాణ్యత, తూకం విషయంలో అనుమానాలు రావడం సహజం. కొన్నిసార్లు ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు అమ్మడం, తూకంలో మోసాలకు పాల్పడటం చేస్తుంటారు. ఇలాంటి అక్రమాలను అరికట్టేందుకు తూనికలు, కొలతల శాఖ కఠిన చర్యలు చేపట్టింది. సంగారెడ్డి జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేస్తూ, ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందిస్తున్నారు. అక్రమాలకు పాల్పడిన వ్యాపారులపై కేసులు నమోదు చేయడంతో పాటు భారీ జరిమానాలు విధిస్తున్నారు.



ముమ్మర తనిఖీలు.. సత్వర స్పందన

జిల్లావ్యాప్తంగా తూనికలు, కొలతల శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఏదైనా ఫిర్యాదు అందిన వెంటనే 24 నుంచి 48 గంటల్లోగా సంబంధిత ప్రదేశానికి వెళ్లి సమస్యను పరిష్కరిస్తున్నారు. తక్కువ తూకం లేదా కొలతలతో మోసాలు చేసే వ్యాపారులపై, అలాగే వస్తువులపై ముద్రించిన ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు విక్రయించే వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారికి రూ. 5 వేల నుంచి రూ. 25 వేల వరకు జరిమానా విధిస్తున్నారు. ప్రజలు మోసపోకుండా ఉండేందుకు అవగాహన కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు.



నిబంధనలు తప్పనిసరి

వ్యాపారులు ప్రతి రెండేళ్లకోసారి తమ తూనిక రాళ్లకు, ఎలక్ట్రానిక్ కాంటాలకు ఏడాదికి ఒకసారి తూనికలు, కొలతల శాఖ నుంచి ప్రామాణిక ముద్రలు వేయించుకోవాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందుకు కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. చాలామంది వ్యాపారులు ఈ నిబంధనలను పాటించడం లేదు. ముఖ్యంగా తోపుడు బండ్లు, కూరగాయల మార్కెట్లు, కిరాణా దుకాణాల్లో ఇప్పటికీ పాత పద్ధతుల్లోనే విక్రయిస్తున్నారు. వ్యాపారులు వినియోగించే తూనిక యంత్రాలపై తప్పనిసరిగా ప్రామాణిక ముద్రలు వేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

సంగారెడ్డి జిల్లాలో కేసులు, జరిమానాలు

సంవత్సరం	కేసులు	జరిమానా(రూ.)
2021-22	329	17,23,625
2022-23	162	11,42,000
2023-24	167	11,70,000
2024-25	186	14,60,000
2025-26 (సెప్టెంబరు)	102	6,33,000

నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు

పెట్రోల్ బంకులు, రేషన్ షాపులు, వే బ్రిడ్జిలు, రిటైల్, హోల్‌సేల్, కిరాణా, మటన్, చికెన్ షాపుల్లో తూకంలో తేడాలు ఉన్నా, అనుమానం వచ్చినా ప్రజలు నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చు. ప్రతి ప్యాకేజ్డ్ వస్తువుపై ఎమ్మార్పీ, ప్యాకింగ్ తేదీ, చిరునామా, కస్టమర్ కేర్ నంబర్ తప్పనిసరిగా ఉండాలి. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలి. ముఖ్యంగా పెట్రోల్ పోయించుకునే ముందు జీరో పాయింట్‌ను చూసుకోవాలి. ఏ విధమైన మోసాలు జరిగినా, అనుమానం వచ్చినా టోల్ ఫ్రీ 180042500 333, 8523011449 నంబర్లకు ఫిర్యాదు చేయవచ్చు.



చట్ట ప్రకారం చర్యలు

తూనికలు, కొలతల్లో మోసాలు, అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. వినియోగదారులు మోసపోకుండా ఉండేందుకు మా శాఖ అన్ని చర్యలు తీసుకుంటుంది. వ్యాపారులు ఉపయోగించే ఎలక్ట్రానిక్ కాంటా, తూనిక రాళ్లకు తప్పనిసరిగా అధికారిక ముద్రలు వేయించుకోవాలి. ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి బాధితులకు న్యాయం చేస్తాం

- ఎం. అనిల్‌కుమార్, జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి, సంగారెడ్డి జిల్లా




రామాయంపేట మల్లెచెరువు కట్టపై చేపల మార్కెట్, రామాయంపేట ప్రధాన రహదారిని ఆనుకుని ప్రమాదకరంగా ఉన్న చెరువు

మినీ ట్యాంక్‌బండ్ కలేనా..?


- ఏడేళ్ల క్రితం నిధులు మంజూరు
- అరకొర పనులతో నీరుగారిన లక్ష్యం

రామాయంపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి మూలం మల్లెచెరువు. ప్రధాన రహదారిపై కిలోమీటర్ మేర విస్తరించి ఉంది. ప్రయాణికులకు ఆహ్లాదం పంచేదిగా ఉన్నా.. ప్రమాదం పొంచి ఉందక్కడ. అంతేకాదు పెద్దవాటి కట్టపై చేపల మార్కెట్ ఏర్పాటుతో కంపు కొడుతోంది. రామాయంపేట-సిద్దిపేట రూట్‌లోని మల్లెచెరువును మినీ ట్యాంక్‌బండ్‌గా మార్చేందుకు ఏడేళ్ల క్రితం అప్పటి మంత్రి హరీశ్‌రావు నిధులు వెచ్చించారు. కానీ అరకొర పనులతో లక్ష్యం నీరుగారింది. పర్యాటకులకు ఆహ్లాదం పంచాల్సిన మల్లెచెరువు ప్రస్తుతం వీధుల్లోని మురుగునీరు చేరి కంపు కొడుతోంది. అంతేకాదు రహదారి ఆనుకొని ఉన్నా కనీసం ఫెన్సింగ్ ఏర్పాటు చేయలేదు. రామాయంపేట నుంచి సిద్దిపేట మీదుగా విజయవాడకు వెళ్లే రహదారి అయినందున బైకర్లు అదుపు తప్పి ఈ చెరువులో పడిన సంఘటనలూ ఉన్నాయి. సుమారు రూ.5 కోట్లతో ఆహ్లాదంగా తీర్చిదిద్దుతామన్నా.. ప్రస్తుతం అరకొర నిధులతో సరిపెట్టుకోవాల్సి వస్తున్నది. మినీ ట్యాంక్‌బండ్‌గా కాకపోయినా కనీసం రహదారి ఆనుకొని ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ప్రమాదాలు అరికట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆస్తి తగాదాలు.. సైనికుడి ఆత్మహత్యాయత్నం

- ఆసుపత్రికి తరలింపు..

దుబ్బాక, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆస్తి తగాదాల కారణంగా ఓ సైనికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన దుబ్బాక మండలం చీకోడ్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చీకోడ్ గ్రామానికి చెందిన దొడ్ల అశోక్ గౌడ్ ఇండియా-నేపాల్ సరిహద్దులో ఆర్మీలో సైనికుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇటీవల దసరా సెలవుల్లో స్వగ్రామానికి వచ్చాడు. అయితే, ఆస్తి పంపకాల విషయంలో కుటుంబ సభ్యుల మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల కూడా ఆస్తి పంపకాల విషయమై చర్చలు జరిపినా.. సమస్య పరిష్కారం కాలేదు. తన వాటా ఇవ్వడంలేదని, ఇందుకు తన తల్లి సులోచన, తమ్ముళ్లు అరుణ్‌కుమార్, ప్రవీణ్ కుమార్‌తో పాటు వీరికి సహకరిస్తున్న అదే గ్రామానికి చెందిన చెలుకల నర్సారెడ్డి, జి. శ్రీనివాస్‌గౌడ్, జి.అంజలి కారణమని పేర్కొంటూ సూసైడ్ నోట్ రాశాడు. తన భార్య, పిల్లలకు న్యాయం చేయాలని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నాడు. అనంతరం సెల్ఫీ వీడియో తీసుకుంటూ మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆ వీడియోను గ్రామ వాట్సాప్ గ్రూప్, గ్రామపెద్దలకు పంపించాడు. అప్రమత్తమైన గ్రామస్థులు అతన్ని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సిద్దిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దుబ్బాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సూసైడ్ లేఖ

ముగిసిన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

గుమ్మడిదల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆరు రోజులపాటు ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి స్వామివారు శ్రీదేవి భూదేవి సమేతంగా గరుడవాహన సేవలో ఊరేగుతుండగా మహిళలు మంగళహారతులతో స్వామివారిని ఘనంగా ఆహ్వానించారు. ఆదివారం చివరి రోజు మహాపూర్ణాహుతి, చక్రవారి, నవకలశాభిషేకం, నివేదన, హారతి వంటి విశేష పూజా కార్యక్రమాలు వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య నిర్వహించారు.

వాలీబాల్ పోటీల్లో విజేత కాసాల జట్టు

కల్హేర్/సిర్గాపూర్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి);మండల కేంద్రమైన సిర్గాపూర్‌లో స్థానిక సిర్గాపూర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హోరాహోరీగా శనివారం రాత్రి జరిగిన ఫైనల్లో హత్నూర మండల పరిధిలోని కాసాల జట్టు సిర్గాపూర్ జట్టుపై విజయం సాధించింది. 22 జట్లు పాల్గొన్న ఈ పోటీలు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో జరుగగా ఫైనల్ పోటీ కాసాల, సిర్గాపూర్ జట్ల మధ్య హోరాహోరీగా తలపడగా కాసాల జట్టు విజయం సాధించింది. విజేత కాసాల జట్టుకు రూ. 10 వేయిల నగదు బహుమతి, ట్రోఫీ, రన్నరప్‌గా నిలిచిన సిర్గాపూర్ జట్టుకు రూ. 5000 నగదు బహుమతి, ట్రోఫీని స్థానిక ఎస్‌ఐ మహేష్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సిర్గాపూర్ మాజీ సర్పంచ్ శ్రీనివాసరావ్, వాలీబాల్ మాజీ ఆటగాడు కళ్యాణ్‌రావ్ పాటిల్, మాజీ ఎంపిటిసీలు రాంచందర్, సంజీవరావ్‌పాటిల్, రాజ్‌కుమార్ సిగ్రె, నిర్వహకులు యూత్ అసోసియేషన్ సభ్యులు విటల్, నర్సాగౌడ్, ప్రవీణ్, శివకుమార్, బాలరాజు, గిరి, సాయిగణేష్, అనిల్‌గౌడ్, జకీర్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై యువకుడు ఆత్మహత్య

జగదేవ్ పూర్/మర్కుక్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించిన అమ్మాయి పెళ్లికి ఒప్పుకోకపోవడం, పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మద్యానికి బానిసై ఓ యువకుడు ఆదివారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ కృష్ణారెడ్డి వివరాల ప్రకారం.. జగదేవ్‌పూర్ మండలం నబీనగర్‌కు చెందిన బింగి నర్సింలు(28) గతంలో ప్రేమించిన అమ్మాయి పెళ్లికి నిరాకరించడం, పెళ్లి కుదరకపోవడంతో రెండుసార్లు పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. అనంతరం మద్యానికి బానిసగా మారి తరచూ ఇంట్లో తల్లిదండ్రులతో గొడవపడేవాడు. ఈనెల 24న ఇంట్లో గొడవపడి బయటకెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. కాగా శనివారం రాత్రి 8 గంటల సమయంలో నర్సింలు మృతదేహం నబీనగర్‌లోని వ్యవసాయ బావిలో కనిపించడంతో ఆదివారం ఉదయం స్థానికుల సహాయంతో బయటకు తీశారు. తండ్రి సత్తయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహం కుళ్లిపోవడంతో గజ్వేల్ ఆస్పత్రి వైద్యులు గ్రామంలోనే పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.



బింగి నర్సింలు (ఫైల్)

వరదల్లో కొట్టుకొచ్చిన గుర్తు తెలియని మృతదేహం

నారాయణఖేడ్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : వరద ప్రవాహంలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం కొట్టుకొచ్చిన సంఘటన నారాయణఖేడ్ పరిధి నిజాంపేట మండలం నాగ్ధర్ శివారులోని మోదులకుంట తండా వద్ద చోటు చేసుకుంది. తండా సమీపంలోని పాత వంతెన కింది భాగంలో చెత్త, కర్రలతో పాటు దాదాపు 30-40 ఏళ్ల వయస్సు గల యువకుడి మృతదేహం కొట్టుకొచ్చి నిలిచిపోయింది. ఆదివారం ఉదయం అటుగా వెళ్తున్న గ్రామస్థులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. కల్హేర్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహం కుళ్లిన స్థితిలో ఉందని, నాలుగైదు రోజుల క్రితమే మృతిచెంది ఉండొచ్చని, ముఖం కనిపించడం లేదని పోలీసులు తెలిపారు. ఎక్కడైనా మిస్సింగ్ కేసు నమోదై ఉన్న లేదా మృతదేహాన్ని గుర్తు పడితే కంగ్టి సీఐ 8712656734, కల్హేర్ ఎస్‌ఐ 8712656761 లేదా పోలీస్‌స్టేషన్ నెంబరు 8712661858 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అనారోగ్యంతో వంట మనిషి మృతి

మాసాయిపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో వంట మనిషి మృతి చెందాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన కైలా విజయ్‌కుమార్(38) మెదక్ జిల్లా మాసాయిపేట మండలం అచ్చంపేట రామంతాపూర్ పరిధిలోని సాఫ్రాన్ వ్యాలీ వెంచర్‌లో రెండేళ్లుగా వంట మనిషిగా పనిచేస్తూ అక్కడే నివసిస్తున్నాడు. అయితే విజయ్‌కుమార్ కొన్నిరోజులుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. కాగా శనివారం రాత్రి 9 గంటలకు భోజనం చేసి పడుకున్నాడు. ఆదివారం ఉదయం 6 గంటలకు అక్కడే మేస్త్రీగా పనిచేసే శివరాత్రి కృష్ణ వచ్చి లేపగా లేవలేదు. మృతిచెందాడని గుర్తించి చిలకలూరిపేటలో ఉంటున్న భార్య కైలా అరుణకు ఫోన్ ద్వారా సమాచారమందించారు. వెంటనే ఆమె వచ్చి బోరున విలపించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



విజయ్‌కుమార్ మృతదేహం

కష్టాన్ని ఎదిరించి.. కొలువులు సాధించి..

● గ్రూప్-2లో మెరిసిన ఉమ్మడి జిల్లావాసులు

కష్టపడితే సాధించలేనిదేదీ లేదని నిరూపించారు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన యువతీ, యువకులు. ప్రభుత్వం ఆదివారం ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఉద్యోగాలకు ఎంపికైన వారిని కుటుంబసభ్యులు, గ్రామస్థులు అభినందిస్తున్నారు.

జూనియర్ అసిస్టెంట్ నుంచి ఏఎస్‌వోగా



మెదక్ అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-2 ఫలితాల్లో మెదక్ పట్టణానికి చెందిన తారక సమత సత్తాచాటారు. మెదక్ పట్టణానికి చెందిన తారక మురళీ, జ్యోతి దంపతుల కుమార్తె సమత మొదటి నుంచి చదువులో చురుకుగా ఉండేది. ప్రభుత్వం జారీచేసిన గ్రూప్-4 పరీక్షల్లో 82 ర్యాంకు సాధించి.. తూప్రాన్ ఆర్డీవో కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నారు. తాజాగా ఆదివారం ప్రకటించిన గ్రూప్-2 ఫలితాల్లో 234 ర్యాంక్ సాధించి అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. తొలి ప్రయత్నంలోనే గ్రూప్-2కు ఎంపిక కావడం పట్ల సమతను పలువురు అభినందిస్తున్నారు.

ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ప్రణయ్‌సాయి



తూప్రాన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణానికి చెందిన బోయిన్‌పల్లి ప్రణయ్‌సాయి ఆదివారం విడుదల చేసి గ్రూప్-2 ఫలితాల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు ఎంపికయ్యారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు విష్ణు, శ్రీవిద్య దంపతుల కుమారుడైన ప్రణయ్‌సాయి గతంలో గ్రూప్-4 ఫలితాల్లో సత్తాచాటి చేగుంట తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మార్చిలో విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో 17వ ర్యాంకు సాధించగా.. 24న విడుదలైన ఫలితాల్లో డీఎస్పీగా ఎంపికై శనివారం సీఎం చేతులమీదుగా నియామకపత్రం పొందారు. ప్రస్తుతం గ్రూప్-2 ఫలితాల్లో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికయ్యారు. గ్రూప్-3 ఫలితాల్లోనూ ప్రణయ్‌సాయి ర్యాంకు సాధించారు.

గ్రూప్-1 సాధించడమే లక్ష్యం



పాపన్నపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గ్రూప్-2 ఫలితాల్లో పాపన్నపేట మండల నుంచి ఇద్దరు డిప్యూటీ తహసీల్దార్లుగా ఎంపికయ్యారు. పాపన్నపేటకు చెందిన కుకునూరు అర్జున్‌రెడ్డి గ్రూప్-4లో జిల్లాస్థాయిలో 12వ ర్యాంకు సాధించి వీఆర్‌వోగా ఎంపికై, ప్రస్తుతం మెదక్ కలెక్టరేట్‌లో ఆర్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్నారు. గ్రూప్-3లోనూ రాష్ట్ర మొదటిర్యాంకు సాధించారు. అలాగే గ్రూప్-2లో 18వ ర్యాంకు సాధించి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. గ్రూప్-1 సాధించడమే లక్ష్యమని అర్జున్‌రెడ్డి తెలిపారు.

- అర్జున్‌రెడ్డి, పాపన్నపేట

సివిల్స్ నా లక్ష్యం



పాపన్నపేట మండలం అబ్లాపూర్‌కు చెందిన బాయికాడి సుస్మిత గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 41వ ర్యాంకు, మహిళల్లో రెండో ర్యాంకు సాధించి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యారు. 2018లో టీఎస్పీఎస్సీ పరీక్షల్లో గురుకుల పీజీటీగా ఎంపికయ్యారు. సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని సుస్మిత పేర్కొన్నారు. సివిల్ సర్వీసెస్ అధికారిగా ప్రజలకు మంచి మెరుగైన అందించాలన్నదే నా లక్ష్యం తెలిపారు.

- బాయికాడి సుస్మిత, అబ్లాపూర్

పట్టుదలతో గ్రూప్-2కు ప్రిపేర్..



చేగుంట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : చేగుంట మండలం బి.కొండాపూర్ గ్రామానికి చెందిన అల్లి విజయసేనారెడ్డి గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో 259 ర్యాంకు సాధించి.. ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం విజయసేనారెడ్డి చేగుంట మండలం మక్కారాజపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే.. పట్టుదలతో చదివి గ్రూప్-2కు ఎంపికయ్యారు.

గ్రూప్-2లో సత్తాచాటిన గజ్వేల్ వాసి



గజ్వేల్ రూరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణానికి చెందిన తాటి మురళీ, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు తాటి సాయికుమార్ మూడు ఉద్యోగాలు సాధించి ఔరా అనిపించాడు. గతేడాది విడుదలైన గ్రూప్-4 ఫలితాల్లో ఉద్యోగం సాధించాడు. గ్రూప్-3లో 307 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 54వ ర్యాంకు సాధించాడు. గ్రూప్-2 ఉద్యోగం వస్తదని వెళ్లలేదు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో గ్రూప్-2లో 14వ ర్యాంకుతో 418 మార్కులు సాధించి డిప్యూటీ తహసీల్దార్‌గా ఎంపికయ్యాడు.

పేదరికాన్ని జయించి.. ఏఎస్‌వోగా



నారాయణఖేడ్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటకు చెందిన రాజ్‌కుమార్ గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఓపెన్ కేటగిరీలో 168వ ర్యాంకు, జోనల్ విభాగంలో 28వ ర్యాంకు సాధించి ఏఎస్‌వోగా ఎంపికయ్యారు. గ్రూప్-4 ఫలితాల్లో సైతం సత్తాచాటి వాణిజ్య పన్నుల విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ పేదరికాన్ని జయించి.. ఉద్యోగాన్ని సాధించడం ఆనందంగా ఉన్నదన్నారు.

గ్రూప్-1పైనే దృష్టి



దుబ్బాక, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కష్టాన్ని ఎదురొడ్డి.. గ్రూప్-2లో 166వ ర్యాంకు సాధించి అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యాడు దుబ్బాక పట్టణానికి చెందిన యాడారం రాములుగౌడ్, లక్ష్మి దంపతుల ఏకైక కుమారుడు నవీన్‌గౌడ్. తండ్రి 1999లో మృతిచెందినా చదువును ఆపలేదు. తల్లి బీడీలు చుట్టి చదివించింది. నవీన్‌గౌడ్ 2018లో పంచాయతీ కార్యదర్శిగా, 2020లోని గ్రూప్-4లో సైతం హాస్టల్ వార్డెన్‌గా, ప్రస్తుతం గ్రూప్-2లో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. గ్రూప్-1 సాధించడంపైనే దృష్టి పెడతానని తెలిపాడు.

తెలంగాణ ఐకాన్ బతుకమ్మ ఉత్సవాలు



దుబాయ్‌లో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయంగా బతుకమ్మ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయని ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. ఆదివారం దుబాయ్‌లో బతుకమ్మ ఉత్సవాలు దీపప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణకు బతుకమ్మ ఉత్సవాలు ఐకాన్‌గా మారుతోందని తెలిపారు.

మల్లన్న సేవలో పాట్నా హైకోర్టు జడ్జి



పాట్నా హైకోర్టు జడ్జి గున్ను అనుపమచక్రవర్తికి స్వామివారి చిత్రపటాన్ని బహుకరిస్తున్న ఆలయాధికారులు, అర్చకులు

కొమురవెల్లి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లికార్జునస్వామిని ఆదివారం పాట్నా హైకోర్టు జడ్జి గున్ను అనుపమచక్రవర్తి కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన జడ్జికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం జడ్జికి ఆలయ ఈవో టంకశాల వెంకటేష్ స్వామివారి చిత్రపటాన్ని బహుకరించగా.. అర్చకులు ఆశీర్వచనం అందించి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జడ్జి సాధన, ఏఈవో శ్రీనివాస్, ప్రధాన అర్చకులు మహదేవుని శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, ఎస్ఐ రాజుగౌడ్ పాల్గొన్నారు.

మెదక్‌లో సద్దుల బతుకమ్మపై సందిగ్ధం

● దుర్గాష్టమి రోజున జరపాలని బ్రాహ్మణ విద్వత్‌సభ నిర్ణయం
● అమావాస్యకు ప్రారంభించి అష్టమికి నిమజ్జనం చేయాలి
● ప్రముఖ సిద్ధాంతి, పంచాంగకర్త, డాక్టర్ శాస్త్రుల కృష్ణమూర్తి

మెదక్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : మెతుకుసీమలో బతుకమ్మ పండుగ తేదీపై అస్పష్టత నెలకొంది. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాస అమావాస్య నాడు ప్రారంభించి, దుర్గాష్టమి నాడు బతుకమ్మ జరుపుకోవడం సంప్రదాయం. కానీ ఈసారి తిథులు, నక్షత్రాల కారణంగా సందిగ్ధత నెలకొంది. మంగళవారం దుర్గాష్టమి తిథి ప్రవేశిస్తోంది. గౌరీదేవిని నిమజ్జనం చేయడం సరికాదని కొందరు వాదిస్తున్నారు. పుట్టింటికి వచ్చిన ఆడబడుచును మంగళవారం అత్తారింటికి పంపడం సాంప్రదాయం కాదని వాదిస్తున్నారు. ఇలా ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొందరు నేడే జరపాలి అంటుంటే, మరి కొందరు రేపు జరపాలని నిర్ణయిస్తున్నారు. ఈ సారి సద్దుల బతుకమ్మ సంబరాలు ఆడబడుచుల్లో అయోమయాన్ని మిగిల్చాయి. సద్దుల బతుకమ్మ పండుగకు శాస్త్రం వర్తిస్తుందా.. తొమ్మిది రోజులే ప్రామాణికంగా పరిగణించాలా.. ఇలా సద్దుల బతుకమ్మకు సిద్ధమవుతున్న మహిళల్లో ఏ నాడు సద్దుల బతుకమ్మను గంగలో నిమజ్జనం చేయాలన్న ప్రశ్నలు తలెత్తున్నాయి. దీనికి శాస్త్రాలు వర్తించవని పలువురు పామరులంటే, ఆదేమిటీ పుష్పక గౌరి వ్రతానికి అన్ని ప్రమాణాలు వర్తిస్తాయని బ్రాహ్మణులు అంటున్నారు.

విద్వత్ సభ నిర్ణయం



డాక్టర్ శాస్త్రుల కృష్ణమూర్తి

29న సద్దుల బతుకమ్మ వేడుకలు జరపాల్సి ఉండగా, పంచమి తిథి రెండురోజులు రావడంతో వివాదం మొదలైంది. ఈ పంచమి తిథి రెండురోజుల పాటు శుక్ర, శని వారాలు ఉండడంతో ప్రజల్లో అయోమయంలో పడ్డారు. ఈ పరిస్థితుల్లో హైదరాబాద్‌లోని బేగంపేటలో ఉన్న పుష్పగిరి పీఠంలో రాష్ట్ర విద్వత్‌సభ సమావేశమై ఈ నెల 30న దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మ అనగా పుష్పకగౌరి వ్రతం నిర్వహించుకోవాల్సింగా ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు ప్రముఖ సిద్ధాంతి డాక్టర్ శాస్త్రుల కృష్ణమూర్తిశర్మ తెలిపారు. అపోహలు లేకుండా మంగళవారం సద్దుల బతుకమ్మ జరుపుకోవాలని జిల్లా ప్రజలకు సూచించారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం బతుకమ్మ పండుగ 30వ తేదీన జరుపుకోవాలని అధికారిక ఆదేశాలు జారీచేసింది.





పెద్ద బతుకమ్మ వేడుకలు జరిగే ఎల్లమ్మ చెరువు వద్ద ఏర్పాట్లు, ఎల్లమ్మ చెరువు సుందరీకరణలో భాగంగా నిర్మించిన మెట్లు

నేడు సద్దుల సంబురం

● బతుకమ్మ నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి
● ఈసారి సుందరంగా ఎల్లమ్మ చెరువు కట్ట

హుస్నాబాద్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలో సోమవారం సద్దుల బతుకమ్మ నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. పెద్ద బతుకమ్మ నిమజ్జనం జరిగే హుస్నాబాద్ పట్టణంలోని ఎల్లమ్మ చెరువుకట్టను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ వేడుకలకు దాదాపు 30 వేల మందికి మహిళలు వస్తుండటంతో... అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేశారు. బతుకమ్మలు ఆడే కట్ట పైకి మహిళలు వెళ్లేందుకు రోడ్డును చదును చేశారు. రూ.18 కోట్లకు పైగా నిధులతో చెరువు సుందరీకరణ పనులు జరుగుతుండటంతో ఇది ఆకర్షణగా నిలువనుంది. బతుకమ్మల నిమజ్జనానికి మూడుచోట మెట్లు నిర్మించారు. పండుగ సందర్భంగా ఏర్పాట్లను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పరిశీలిస్తున్నారు.

పటిష్ట బందోబస్తు: ఏసీపీ

సద్దుల బతుకమ్మ సందర్భంగా హుస్నాబాద్‌లో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఏసీపీ సదానందం తెలిపారు. దాదాపు వేలమంది మహిళలు బతుకమ్మ ఆడేందుకు చెరువు వద్దకు రానుండడంతో ఇబ్బందులు లేకుండా చూస్తున్నామని, వాహనాల పార్కింగ్ కోసం చెరువు సమీపంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద, అంగడి స్థలంలో ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగేలా వాహనాలను పార్కింగ్ చేయవద్దన్నారు. పార్కింగ్ స్థలానికి వచ్చే వాహనాలు అనభేరి విగ్రహం నుంచి ఈద్గా మీదుగా రావాలన్నారు. మల్లెచెట్టు చౌరస్తా నుంచి ఎల్లమ్మ చెరువు వద్దకు వెళ్లేందుకు వాహనాలకు అనుమతి లేదన్నారు. దీనికి ప్రజలు సహకరించాలని కోరారు.

కొనుగోళ్లతో పట్టణం సందడి..

బతుకమ్మ పండుగ సందర్భంగా ఆదివారమైనప్పటికీ హుస్నాబాద్ పట్టణం సందడిగా మారింది. ప్రధాన రహదారిపై పూల దుకాణాలు, బతుకమ్మలు పేర్చేందుకు అవసరమైన రంగులు దుకాణాల వద్ద మహిళలు బారులుతీరారు. బట్టల షాపులు, గాజుల షాపులు, కిరాణా షాపులు రద్దీగా మారాయి.

అంతా సిద్ధం

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మ పండుగ సంబరానికి సిద్ధమవుతున్నారు సిద్దిపేట వాసులు. సద్దుల బతుకమ్మ కోసం అవసరమైన తంగేడు, గునక, పట్టుకుచ్చుపూలు, బంతి పూలు, చామంతిపూలను పల్లెటూర్ల నుంచి తీసుకొచ్చి పట్టణంలోని సుభాష్ రోడ్డు, రైతు బజార్, హౌజింగ్ బోర్డు, గాంధీ రోడ్డు, విక్టరీ చౌరస్తా, డిగ్రీ కాలేజ్ రోడ్డు పక్కన పోసి విక్రయించారు. ఆటోల్లో పెద్ద ఎత్తున పూలను విక్రయించేందుకు తీసుకొచ్చి అమ్మకానికి పెట్టారు. ఇక మరోవైపు కొత్త బట్టలు తీసుకోవడానికి వస్త్ర దుకాణాల్లో జనాల హడావిడి నెలకొంది.

బతుకమ్మ ఏర్పాట్లపై హరీశ్‌రావు అసంతృప్తి

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మకు వచ్చే ప్రజలకు కోమటి చెరువు వద్ద ఎలాంటి ఇబ్బందులు ఉండొద్దని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. బతుకమ్మ ఏర్పాట్లను ఆయన ఆదివారం రాత్రి పరిశీలించారు. టూరిజంశాఖ ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు, సస్పెన్షన్ బ్రిడ్జ్‌కు లైట్స్ ఏర్పాటు చేయకపోవడం, గ్లో గార్డెన్‌లో సరైన సౌకర్యాలు లేకపోవడం పట్ల టూరిజం శాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎప్పుడూ కోమటి చెరువుకట్టపై జరిగే వేడుకలకు ఏర్పాట్లు ఎందుకు చేయలేదన్నారు. గతంలో మాదిరిగా అన్ని ఏర్పాట్లు ఉండాలని సూచించారు. మున్సిపల్ అధికారులకు పలు సూచనలు చేశారు. పటిష్ట బందోబస్తు చేయాలని సిద్దిపేట ఏసీపీకి ఫోన్‌చేసి చెప్పారు. మున్సిపల్, పోలీస్, టూరిజం అధికారులు సమన్వయంతో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలన్నారు.



కోమటి చెరువుకట్టపై బతుకమ్మ ఏర్పాట్ల గురించి అధికారులకు సూచనలు చేస్తున్న హరీశ్‌రావు



సిద్దిపేటలో సద్దుల బతుకమ్మ కోసం పూలను కొనుగోలు చేస్తున్న జనం



సంగారెడ్డి జిల్లా కేంద్రంలో పాత బస్టాండ్ సమీపంలో చెరువు కట్టపైన దసరా, బతుకమ్మ సందర్భంగా విద్యుత్‌దీపాల ఏర్పాట్లు

నదులు నాగరికతకు మూలాలు

● ఫోరమ్ ఫర్ హైదరాబాద్ అధ్యక్షుడు మణికొండ వేదకుమార్
● మంజీరా నది వద్ద 'నదితో నడక' కార్యక్రమం



మంజీరా నది వద్ద మాట్లాడుతున్న సభ్యులు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదని ఫోరమ్ ఫర్ హైదరాబాద్ అధ్యక్షుడు మణికొండ వేదకుమార్ అన్నారు. అంతర్జాతీయ నదుల దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కొత్త తెలంగాణ చరిత్ర బృందం, దక్కన్ హెరిటేజ్ సొసైటీతో కలిసి ఆదివారం ఏడుపాయల మంజీరా నదిని బృంద సభ్యులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా నదితో నడక కార్యక్రమాన్ని వేదకుమార్ ప్రారంభించి మాట్లాడారు. నదులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిదని, నదులు నాగరికతకు మూలమన్నారు. దేశంలో అనేక నదుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. గతంలో కంటే ఎక్కువ నదులు కలుషితమైనట్లు తెలిపారు. జీవ నదులను పరిరక్షించకపోతే మానవ మనుగడకే ప్రమాదమన్నారు. కాలుష్యానికి దూరంగా నదులను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. రాబోయే తరాలకు నదులను అందించాలని గొప్ప సంకల్పంతో అంతర్జాతీయ స్థాయిలో దాదాపు 100 దేశాల్లో జరుపుతున్న ఈ నదుల దినోత్సవాన్ని ఈ సంవత్సరం మెదక్ జిల్లాలోని ఏడుపాయల వద్ద మంజీరా నది సమక్షంలో జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. మెదక్ పట్టణానికి చెందిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు బుర్ర సంతోష్ మాట్లాడుతూ మెతుకుసీమ వరప్రదాయని మంజీరా అని, మంజీరా సమక్షంలో గొప్ప గొప్ప పుణ్యక్షేత్రాలతో పాటు గొప్ప చరిత్ర దాగుందన్నారు. వాటన్నింటినీ వెలికితీసి నది, మెతుకుసీమ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటి చెప్పడానికి కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ హైదరాబాద్ వైస్ ప్రెసిడెంట్ ఎంహెచ్.రావు, వేణుగోపాలరావు, వాటర్ మాన్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

జలదిగ్బంధంలో వైకుంఠధామం

కంది, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి పక్కనే ఉన్న కంది మండలంలోని తునికిళ్లతండాలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి ఊరంతా వరదనీటిమయమైంది. ఆదివారం గ్రామంలోని వైకుంఠధామంలో అడుగుపెట్టలేని పరిస్థితి నెలకొన్నది. వర్షపునీరు చుట్టూ చేరడంతో బయటకు పోయో దారిలేక మృతదేహాలు దహనం చేసే చోటు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నది. అంతేగాకుండా వైకుంఠధామానికి కేటాయించిన స్థలం పక్కనే డంపుయార్డు నిర్మించారు. డంపుయార్డు కూడా పూర్తిగా నీట మునిగింది. డంపుయార్డు జలమయం కావడంతో ఊరిలోని చెత్త మొత్తం గ్రామంలోనే ఎక్కడపడితే అక్కడ పారబోస్తున్నారు. ఊరికి ఆనుకుని ఊరకుంట చెరువు ఉండడంతో అందులోకి వెళ్లాల్సిన నీరుకూడా వైకుంఠధామంలోకి మళ్లింది. ప్రత్యేక అధికారులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం వల్లే వైకుంఠధామానికి ఈ దుస్థితి పట్టిందని గ్రామస్థులు వాపోతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు వైకుంఠధామంలో నిండిన నీటిని తొలగింపజేయాలని, వైకుంఠధామాన్ని, డంపుయార్డును వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



తునికిళ్లతండాలోని వైకుంఠధామంలో మృతదేహాలు దహనం చేసే స్థలం చుట్టూ చేరిన వర్షం నీరు

అలరించిన బతుకమ్మ వేడుకలు




అందోల్ - జోగిపేట మున్సిపల్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో, పెద్దశంకరంపేట మండలంలోని రామోజీపల్లిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు, చిన్నారులు

జోగిపేటరూరల్/కల్హేర్/సిర్గాపూర్/పెద్దశంకరంపేట/నిజాంపేట, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ సంబురాలను ఆదివారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోని ఆయా మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి సాయంత్రం ప్రధాన కూడళ్లలో ఒక్కచోటికి చేర్చి బతుకమ్మ ఆటపాటలతో ఆడపడచులు చిన్నా పెద్దా తేడా లేకుండా సందడి చేశారు. సంగారెడ్డి జిల్లా అందోల్ - జోగిపేట మున్సిపల్ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో మహిళలు, యువతులు బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు.

అనంతరం అందోల్ పెద్ద చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు. కల్హేర్, సిర్గాపూర్ మండలాల పరిధిలోని గ్రామాల్లో అట్ల బతుకమ్మ వేడుకలను మహిళలు ఘనంగా జరుపుకున్నారు. మెదక్ జిల్లా పెద్దశంకరంపేటతో పాటు ఆయా గ్రామాల్లో ఆదివారం అట్ల బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. నిజాంపేట మండల పరిధి కల్వకుంట గ్రామంలో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య నేతృత్వంలో బహుజన బతుకమ్మను అట్టహాసంగా నిర్వహించారు. కళాకారుల నృత్యాలు, ఆటపాటలతో ప్రజలను అలరించారు. మహిళలు పెద్దఎత్తున బతుకమ్మ ఆడారు.

రోజుకో అలంకారంలో అమ్మవారి దర్శనం



అల్లాదుర్గం: దుర్గాభవాని మండపంలో కుంకుమార్చన

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో కనులపండువగా కొనసాగుతున్నాయి. రంగుల విద్యుత్ కాంతుల మధ్య అమ్మవారి మండపాలు దేదీప్యమానంగా వెలిగిపోతున్నాయి. ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను రోజుకో అలంకారంలో భక్తులు దర్శించుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం అమ్మవారి విగ్రహాలను పలుచోట్ల మహాలక్ష్మి అలంకారంలో భక్తులు దర్శించుకోగా మరికొన్ని చోట్ల మహాచండీ అలంకారంలో అమ్మవారు పూజలందుకున్నారు. ఆయా మండపాల్లో అమ్మవారి ప్రతిమలను ప్రముఖులు, ప్రజాప్రతినిధులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వెల్దుర్తి: శేరిలో దుర్గాహోమంలో భక్తులు



గుమ్మడిదల: అన్నారంలో మహాచండీదేవి అలంకారంలో భద్రకాళి అమ్మవారు



సదాశివపేట గడి మైసమ్మ మందిరంలో మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు

హామీలను అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్‌దే



డీఎస్పీ ఉద్యోగం సాధించిన అఖిలారెడ్డిని సన్మానిస్తున్న జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్, తదితరులు

జహీరాబాద్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అధికారంలో కొనసాగుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి(కాంగ్రెస్) ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తుందని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ పేర్కొన్నారు. మాజీసర్పంచ్, నాయకులు ప్రతాప్‌రెడ్డి 6వ వర్ధంతిని ఆదివారం పట్టణంలోని పస్తాపూర్‌లో ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజల కు ఇచ్చిన హామీలన్నింటిని అమలుచేసి ఆచరణలో పెడుతున్న ఘనత కాంగ్రెస్‌కే దక్కిందన్నారు. న్యాల్‌కల్ మండలం మిర్జాపూర్(బి)గ్రామానికి చెందిన అఖిలారెడ్డిని గ్రూప్-1లో డీఎస్పీగా ఉద్యోగం సాధించడంతో ఎంపీ ఆమెను పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు.

● కాగా మాజీసర్పంచ్, జిల్లాకాంగ్రెస్ నాయకుడు ప్రతాప్‌రెడ్డి వర్ధంతిని పస్తాపూర్‌లో నిర్వహించగా, కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొని జహీరాబాద్ ప్రాంతంలో ఆయన ప్రజలకుచేసిన సేవలను కొనియాడారు.

వసతుల కల్పనకు పెద్దపీట



అమీన్‌పూర్‌లో దివ్యాంగులకు ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

అమీన్‌పూర్/పటాన్‌చెరు రూరల్/పటాన్‌చెరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర శివారు మున్సిపాలిటీలలో మౌలికవసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో 3.20కోట్ల విలువైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. డొనేట్ కార్ట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో 15మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అదేవిధంగా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి జాతీయ రహదారి నుంచి విజేత కాలనీ వరకు రూ.1.30కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన సీసీ రోడ్డు పనులకు ఉదయం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో రూ.2.15 కోట్లతో ఆల్విన్‌కాలనీ, సీతారామపురం, శాంతినగర్, గౌతమ్‌నగర్, కృషి డిఫెన్స్ కాలనీల్లో చేపట్టనున్న సీసీరోడ్డు, బీటీరోడ్డు, వరదనీటి కాలువల నిర్మాణ పనులను కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలో 170 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలకు రెండు చీరలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం పటాన్‌చెరు సాకి చెరువు కట్టపై నిర్వహించనున్న సద్దులబతుకమ్మ ఉత్సవాల కోసం అధికారులు చేస్తున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. సోమవారం సాయంత్రం సమయంలో సినీకళాకారులతో గాన కచేరి ఉంటుందని తెలిపారు. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేవిధంగా జానపద కళాకారుల బృందాలు సంగీత విభావరి నిర్వహించనున్నట్టు తెలిపారు. సద్దుబతుకమ్మరోజున అందంగా అలంకరించిన బతుకమ్మలకు పట్టుచీర అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఎమ్మెల్యే చెప్పారు.

ఘనంగా ఓనం ఉత్సవాలు



ఓనం ఉత్సవాల్లో పృథ్వీరాజ్ తదితరులు

రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): భారతీనగర్ డివిజన్ పరిధి భెల్ కాలనీలో కేరళ ప్రాంతీయులు ఓనం ఉత్సవాలు ఘనంగా జరుపుకున్నారు. సంప్రదాయ పద్ధతిలో అమ్మవారికి మండపం నిర్మించి పూజలు చేశారు. ఓనం విశేషాలను నాటక ప్రదర్శన రూపంలో వివరించారు. ఎండీఆర్ ఫౌండేషన్ చైర్మన్ పృథ్వీరాజ్ ఉత్సవాలకు హాజరయ్యారు.

లక్షణంగా తొలగింపు

(5వ పేజీ తరువాయి)

అవకాశాలు ఉన్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం అమీన్‌పూర్ పరిధిలో 97, జిన్నారంలో 66 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. ఇతర రాష్ట్రాల వారే ఇక్కడ ఎక్కువగా నివసిస్తున్నారు. వారంతా ఇక్కడితోపాటు సొంతూళ్లలోనూ ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని భావిస్తుంటారు. మరికొంతమంది ఇక్కడ అద్దె ఇళ్లు మారినప్పుడల్లా కొత్తగా నమోదు చేసుకోవడంతో రెండు మూడు చోట్ల ఓటరుగా ఉండే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ఇకపై ఇటువంటివారు ఇకపై ఏదో ఒకచోట మాత్రమే ఓటరుగా కొనసాగే అవకాశం ఉండటంతో సొంతూళ్లలోనే కొనసాగి.. ఇక్కడ తొలగించే అవకాశం ఉంది.

నజరి నక్షపై దృష్టి

కుటుంబం మొత్తం ఒకే బూత్‌లో ఓటర్లుగా నమోదు చేసుకునేలా నజరి నక్షలు సిద్ధం చేస్తున్నాం. వీటి ఆధారంగా ఇంటింటికి వెళ్లి సర్వే చేస్తాం. 2004లోనూ ఇదే తరహా సర్వే నిర్వహించాం. ఎన్నికల సంఘం ఆదేశాలతో మరోసారి సర్వే చేసేందుకు సిద్ధమవుతున్నాం.

- రంగారావు, తహసీల్దార్

సమాచారం లేకుండానే సమావేశాలా?



మాట్లాడుతున్న బీజేపీ తూప్రాన్ మండల అధ్యక్షుడు పోచయ్య

తూప్రాన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అధికారులు, ఎంపీడీవో రాజకీయ పక్షాలను విస్మరించి సమావేశం నిర్వహిస్తున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు పిట్ల పోచయ్య ముదిరాజ్ ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ఆహ్వానించలేదని పేర్కొన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ.. ముసాయిదా ఓటరు జాబితా పబ్లికేషన్ సందర్భంగా రాజకీయ పక్షాల సమావేశం పిలువకుండానే నిర్వహించారని విమర్శించారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల వార్డుల మహిళా రిజర్వేషన్లు శనివారం ఖరారు చేశారని, ఆ సమావేశానికి సైతం ఆహ్వానించలేదన్నారు. ఆర్డీవో కార్యాలయంలో సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల మహిళా రిజర్వేషన్లు ఖరారు డ్రాకు సైతం ఆహ్వానించలేదని ఆరోపించారు. జాతీయ పార్టీ బీజేపీ మండల అధ్యక్షుడిని ఆహ్వానించకుండా సమావేశం జరపడమేంటని ప్రశ్నించారు. ఈ విషయంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్టు పోచయ్య ముదిరాజ్ తెలిపారు. సమావేశంలో వెంకటేశ్, కుంట రాజు పాల్గొన్నారు.

పండుగ వేళ.. ఆఫర్ల వెల్లువ

● మెదక్ జిల్లా కేంద్రంలో

కిటకిటలాడుతున్న షోరూంలు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా పండుగలతో మెదక్ జిల్లాలో వాహన షోరూంలలో సందడి మొదలైంది. విజయదశమి, దీపావళి నేపథ్యంలో విక్రయాలు పెంచుకునేందుకు వాహన కంపెనీలు ఆఫర్లు ప్రకటిస్తుండగా.. జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు డబుల్ ధమాకా కలిసొచ్చింది. సులభ వాయిదాలపై కొనుగోలుకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. జీరో పేమెంట్‌తో బైక్ కొనే అవకాశం ఇస్తున్నాయి. గిఫ్ట్ ఆఫర్లు, డిస్కౌంట్లను కూడా ప్రకటిస్తున్నాయి. వినియోగదారులను ఆకట్టుకోవడానికి డీలర్లు కూడా ఆఫర్లు ఇస్తున్నారు. పలు వాహన కంపెనీలు వివిధ రకాల ఆఫర్లను పండుగ సందర్భంగా ప్రకటించాయి. దీంతో వినియోగదారులు కొత్త బైక్‌లు కొనుగోలు చేయడానికి మొగ్గు చూపుతున్నారు.



జోరుగా ద్విచక్ర వాహనాల విక్రయాలు



జీఎస్టీ తగ్గుదల, కంపెనీ ఆఫర్లతో ఈ ఏడాది ద్విచక్ర వాహనాల అమ్మకాలు ఊపందుకున్నాయి. హీరో గ్లామర్ ఎక్స్, డెస్టినీ125, హీరో ఎక్స్‌ట్రీమ్125ఆర్, ఎక్స్‌ట్రీమ్ 160 ఆర్, గ్లామర్, ప్యాషన్ ప్లస్, వీడాప్లస్ ఎలక్ట్రికల్ బైక్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ప్రతీ బైక్‌పై రూ.5 వేల వరకు డిస్కౌండ్, జీరో డౌన్ పేమెంట్‌పై రుణ సదుపాయం ఇస్తున్నాం. రెండు రోజుల్లో అమ్మకాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

- బండ నరేందర్, న్యూవాసు హీరో మోటార్స్ యజమాని

చెరువుల పరివాహక ప్రాంతాల్లో బతుకమ్మ ఉత్సవాలు



బండ్లగూడ దోశంచెరువులో బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్

పటాన్‌చెరు సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): చెరువుల పరివాహక ప్రాంతాల్లో బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని కార్పొరేటర్ మెట్టుకుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం పటాన్‌చెరు డివిజన్ పరిధి సాకి, దోశం చెరువులు, పటాన్‌చెరు జేపీ కాలనీలోని రుక్మిణీ సత్యభామ వేణుగోపాలస్వామి ఆలయం పక్కన బతుకమ్మ ఘాట్, ఆల్విన్‌కాలనీ, శాంతినగర్ కాలనీల్లోని బతుకమ్మ ఘాట్‌లను పరిశీలించారు. సోమవారం బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు ఎదురవకుండా ఉండేందుకు జీహెచ్ఎంసీ సిబ్బంది నిత్యం పర్యవేక్షణ జరిపేటట్టు ఏర్పాట్లు చేశామన్నారు.

తుల్జాపూర్‌లో పులిమామిడి రాజు ఆధ్వర్యంలో అన్నదానం



భక్తులకు అన్నప్రసాద వితరణ చేస్తున్న పులిమామిడిరాజు కుటుంబ సభ్యులు

సదాశివపేట, సెప్టెంబరు 28: (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, సంగారెడ్డి ఎమ్మెల్యే కంటెస్టెడ్ క్యాండేట్ పులిమామిడిరాజు కుటుంబ సభ్యులు ఆదివారం మహారాష్ట్ర తుల్జాపూర్‌లో భవానిమాత అమ్మవారిని దర్శించుకుని పత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పులిమామిడి భాగమ్మ జ్ఞాపకార్థం పులిమామిడి రాజు తుల్జాభవాని అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వేలాది భక్తులకు పెద్దఎత్తున అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పులిమామిడిరాజు మాట్లాడారు. లోకకళ్యాణం కోసం అమ్మవారిని వేడుకున్నామన్నారు. రాష్ట్రంలో ప్రకృతి విపత్తుల నుండి ప్రజలను, రైతులను కాపాడాలని భవానిమాతను మొక్కుకోవడం జరిగిందన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలకు పులిమామిడిరాజు దసరా, దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి మమత, మనోజ్, మాధవి, సోమశేఖర్, రాము తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మలకు బహుమతులు



రాయసముద్రం చెరువు కట్టపై బతుకమ్మ ఉత్సవ ఏర్పాట్లు చేస్తున్న కార్పొరేటర్ పుష్పానగేష్

రామచంద్రాపురం టౌన్ సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అందంగా అలంకరించిన బతుకమ్మలకు బహుమతులు అందించనున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ పేర్కొన్నారు. ఆదివారం రామచంద్రాపురం డివిజన్ పరిధి రాయసముద్రం చెరువు కట్టపై జీహెచ్ఎంసీ సిబ్బంది శుభ్రం చేసే పనులు చేపట్టారు. సోమవారం జరగనున్న సద్దుల బతుకమ్మ ఏర్పాట్లను బతుకమ్మ ఘాట్ల వద్ద అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సద్దుల బతుకమ్మల అలంకరణలను ప్రోత్సహించడానికి బహుమతులు ప్రకటించామని తెలిపారు. ప్రథమ రూ.20వేలు. ద్వితీయ రూ.15వేలు, తృతీయ రూ.10వేల చొప్పున నగదు పురస్కారాలను అందజేయనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో ఐలేష్‌యాదవ్, శ్రీను, నాగరాజు గౌడ్, కిరణ్‌గౌడ్, మహిపాల్‌గౌడ్, కృష్ణ, శ్రీశైలం, సామ్రాట్, రఫీ, మల్లేష్, సుంకుస్వామి, రవిగౌడ్, హనుమంతు, రమేష్, వీరేశం, కుమ్మరిరాజు తదితరులు ఉన్నారు.

గుమ్మడిదలలో ఆరంభమైన ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాలు

గుమ్మడిదల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాల అంకురార్పణ గుమ్మడిదలలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కేంద్రంలోని అఖి విద్య విహార్ స్కూల్‌లో విజయదశమి ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో స్వయంసేవకులు ఆర్ఎస్ఎస్ యూనిఫాం ధరించి ఉత్సాహంగా పాల్గొని దేశభక్తి నినాదాలతో వాతావరణాన్ని మార్మోగించారు. ప్రధాన వక్తగా విచ్చేసిన శ్రీ బొల్లినర్సింలు మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణ, దేశసేవ కోసం ఆర్ఎస్ఎస్ శతాబ్దం పాటు చేసిన విశేష కృషిని వివరించారు. ముఖ్య అతిథిగా సరెడ్డి బాలకృష్ణ రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మద్దుల బాల్ రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు అమ్మన్నగారి సదానందంరెడ్డి, వర్తక సంఘం అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, మాజీ సర్పంచ్ ఇందుల సురేందర్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ గుమ్మడిదల శాఖ కార్యవాహ బూరోజు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.